కథ

# ఒక దీపం వెలిగింది

■ ప్రతాప వెంకట

రాజశేఖర్ని చూసిన వారెవరికైనా పిచ్చెక్కుతుంది. వాడు మా ఆఫీసులో చేరి సంవతర్సరమవుతోంది. వాడి జీతం నాలుగంకెలే! ఎలాంటి కష్టమైన పనైనా అవలీలగా ఒప్పుకుంటాడు. డబ్బు సపాందనే వాడి పరమావధి. ఒకసారి వాడింటికి వెళ్ళాను అద్దె కొంపలో వాడు వాడి పెళ్ళాం ఒక సంవత్సరం కొడుకు తల్లీతండ్రి పెళ్ళయిన ఓ చెల్లెలు (నేను వెళ్ళినపుడు అత్తారింట్లో ఉంది). ఇది వాడి కుటుంబం. తండ్రి ప్రైవేటు సంస్థలో పనిచేసినందువల్ల ఎటువంటి పెన్షన్ రాదు. చెల్లెలి పెళ్ళికి తండ్రి చేసిన అప్పు తీర్చుతున్న ఘనత వీడిదట! వాడొక్కడే గానుగెద్దు. ఆ బరువుని బాధ్యతనుకునే వెర్రి మాలోకం వాడు. నేను మా అమ్మని, నాన్నని ఓల్డ్ ఏజ్ హోంలో చేర్పించాకే హాయిగా ఉన్నాను, తామరాకు మీద నీటి బొట్టులా తోడబుట్టిన వాళ్ళని దూరంగా ఉంచుతాను. లేకపోతే అవసరాల కోసం చుట్టూ మూగి జలగల్లా పీల్చేస్తారు. ఆ విషయం వాడికి అర్థమయ్యేలా చెప్పాను. ఊహూ! వాడు వినలేదు. "సర్లే మరిన్ని కష్టాల సుత్తి దెబ్బలు తగిలితే తప్ప వీడిలో మార్పురాదు" అని ఊరుకున్నాను. నేను వాడి కొలిగ్ కమ్ స్నేహితుడిని. వాడితో పాటు ఉంటూ వాడి బాధలు చూస్తుంటే నేనెంత సుఖపడిపోతున్నానో అర్థమవుతోంది. వాడు కష్టపడి డబ్బు సంపాదిస్తాడు కానీ దాచుకున్నట్టేం కనపడదు. అవునులే ఎలా దాచుకుంటాడు? నాకైతే ఎన్నో రకాల సేవింగ్స్... ఇన్వెస్టిమెంట్స్ ఉన్నాయి... అవును మరి ఫ్యూచర్లో ఎవరు ఆదుకుంటారు దీపం ఉండగానే ఇల్లు చక్క బెట్టుకోవాలని ఊరికే అన్నారా? అది చెప్పినా విని అర్థం చేసుకోడు. వాడు మారడు అంతే.

ఒకరోజు వాడు తన పుట్టిన రోజుని ఆఫీసులో శాలరీలో అడ్వాన్సుగా ఒక వెయ్యి రూపాయలు తీసుకున్నాడు "ఓహో మన గురుడు పుట్టిన రోజులు చేసుకుంటున్నాడన్న మాట. పోనీలే ఏడాదికి ఒక్కరోజైనా హ్యాపీగా గడుపుతాడు అనుకున్నాను వాడు నా దగ్గరకొచ్చి "నా కోసం ఒక హాఫ్ డే సెలవు పెట్టగలవా?" అని అడిగాడు. వాడు ఏరోజు సెలవన్నది అడుగా లేదు. నేను సరే అన్నాను. ఇద్దరం కలిసి ఆర్టీసీ బస్సులో పెద్ద మార్కెట్టుకెళ్ళి పళ్ళు, స్వీట్లు కొన్నాము (అక్కడైతే తక్కువ ఖరీదులో ఎక్కువ వస్తాయని అన్నాడు) అవన్నీ ఎందుకో నాకర్థం కాలేదు. కానీ నాకార్థం అయిందేమిటంటే నన్ను వీడు సరుకులు మోయడానికి గాడిదని చేశాడు. కోపమొచ్చినా మాట ఇచ్చాను కాబట్టి దిగమింగుకున్నాను. చెరు సంచుల్లు మోసుకుంటుంటే ఇద్దరం వాటిని మోసుకుంటూ ఓల్డ్ ఏజ్ హోంకి దగ్గరవుతున్నాం. అయితే వీడు ఈ సరంజామా వితరణ ఇక్కడ మొదలెడతాడన్న మాట! గొప్ప ఆదర్శవాదే (మనసులో అనుకున్నాను వెటకారంగా) టీవీల్లో చూడడం తప్పా ఎప్పుడు ఇలా ప్రత్యక్షంగా పాలు పంచుకుని టైమ్ వేస్ట్ చేసుకోలేదు. ఆ హోంలో మా అమ్మానాన్న కూడా ఉంటారు. నేను రావంటే వాడికి విషయం తెలిసిపోతుంది. వెళితే అమ్మానాన్నల చూపుల్ని తప్పుకోడం ఇబ్బంది కానీ అదే నయమనిపించింది. ఇద్దరం లోపలికి అడుగుపెట్టాము. అప్పటికే వాడు వస్తున్న విషయం తెలుసుకుంటూ అందరు కుర్చీల్లో కూర్చుని ఎదురుచూస్తున్నారు. పైగా వీడు వీలైనపుడల్లా అక్కడికి వెళతాడనుకుంటా, కొంతమంది ఆప్యాయంగా పలకరిస్తున్నారు. వీడు పళ్ళు, స్వీట్లు ఒక్కొక్కరికి ఇచ్చి ఆశీర్వాక్షతలు వేయించుకుంటున్నాడు. ఎంతో అపురూపంగా ఉంది ఆ దృశ్యం. మా అమ్మానాన్న కూడా నన్ను అశ్యర్యంగా చూస్తూ వాడిని దీవించారు. చివరగా వాడు ఒక కుర్చీలో కూర్చొని, మీ అందరూ అమ్మలగన్న అమ్మలు.. నాన్నల గన్న తండ్రులు.. మా అమ్మానాన్నా రూపాల్లో ఉన్న మిమ్మల్ని నా శక్తి కొద్ది కొలుచుకుంటున్నాను. నిజానికి నాకు వాళ్ళకి మీకు మధ్య తేడా ఏమి అనిపించదు. వచ్చేనెల నుండి నాకు రెండువేల రూపాయల ఇంక్రిమెంటు వస్తుంది. మీ సేవకో వెయ్యి రూపాయలు పెంచి సమర్పించుకుంటాను. ఆదేమూలకి సరిపోదని నాకు తెలుసు కానీ ఏదో ఉడత సాయం. మీ అనుగ్రహ పాత్రుడనవ్వాలని తపన మరి సెలవు తీసుకుంటాను అని లేచాడు. అందరూ అభిమానంగా లేచి నుంచుని ప్రత్యేకమైన దినాలు, పండుగలు తమకు లేవని ఇలాంటివి జరిగినప్పుడే కాస్త మనసు హుషారుగా ఉంటుందని అందుకని మరికొంత సేపు తమతో గడపమని రిక్వెస్ట్ చేశారు. వాడు తర్వాత పిల్లల అనాథ శరణాలయంలో స్వీట్ల వితరణ ఉందని, పసివాళ్ళు పడుకునేలోగా ఆ పని చేస్తే తనకు తృప్తీ అని వాళ్ళకి చెప్పాడు. ఒక అయిదు నిమిషాలుండి నేను వాడు బయటికొచ్చాము. నాకెందుకో మనసు అన్యమనస్కంగా ఉంది. నేను "ఒక పది నిమిషాలు ఉండరా"... అని లోపలికెళ్లి మా అమ్మానాన్నకి చెరో ఐదు వందలిచ్చి వాళ్ల కాళ్లకు నమస్కరించి బయట పడ్డాక కానీ నా మనసు కుదుటపడలేదు. అదేమిటో నాకు అర్థం కాలేదు.

మేము మరో ప్రాంతంలో ఉన్న పిల్లల హాస్టల్కి వెళ్లాము. వాళ్ళకి వీడు వస్తున్న విషయం తెలుసనుకుంటా.. అందరూ ఎదురు చూస్తున్నారు. కాకపోతే వీళ్ళు పిల్లలు కదా బిలబిల మంటూ చుట్టూ ముగారు. వాడు, నేను స్వీట్లు పంచిపెట్టాము. వాళ్ళు అభినందిచారు. తర్వాత షరామాములుగా తన ఇంక్రిమెంట్ విషయం ప్రస్తావించి తర్వాతి నెల నుండి ఒక 500 రూపాయలు పెంచుతున్నట్టు చెప్పాడు. వాళ్ల చప్పట్లు ఆ రాత్రిలో మెరుపులు మెరిపించాయి. పంచిది వాడైనా మధురానుభూతి నాకు కలిగింది. అదేంటో మా పిల్లలకి ఖరీదైన ఆట వస్తువులు కొనిచ్చినా, బోలెడు డబ్బులు పోసి మంచి బడిలో చదివిస్తున్నా కలగని అనుభూతి ఇది. ఇద్దరం బయట కొచ్చాము 'ఒరేయ్ సారీరా నిన్ను తీసుకొచ్చి బరువు మోయించాను నీ విలువైన సమయాన్ని

తినేశాను. కాస్త నాకు చేదోడుగా ఉంటావనీ అన్నాడు.

సారీ ఎందుకురా నిజానికి నాకు ఇదో గమ్మత్తైన అనుభూతి యాంత్రికమైన నా మనసుకి జీవం పోసావు. ఇందాక మనం వెళ్ళిన ఓల్డ్ ఏజ్ హోంలో మా అమ్మానాన్నా కూడా ఉన్నారు. మొదలు నీకు తెలిసి పోతుందని సిగ్గుపడ్డాను కానీ ఇప్పుడు ధైర్యంగా చెబుతున్నాను.. ఒకటి రెండు నెలల్లో నేను కాస్త పెద్దిల్లు అద్దెకు తీసుకొని మారిపోయి వాళ్లని ఇంటికి తెచ్చుకుంటాను. నీవు అంత మందిని చూసుకుంటున్నావు. నేను నా కన్న తల్లిదండ్రులని చూసుకోలేనా? నా చిన్నప్పుడు అమ్మ కడుపు చల్లగా... అత్త కడుపు చల్లగా.. అంటూ తలంటేది నన్ను కంటికి రెప్పల్లా అనుక్షణం కాపాడేది మా అమ్మ, తన చాలీ చాలని జీతంతో అవస్థ పడుతూ.. నా ఆనందం కోసం, నా చదువు కోసం డబ్బు ధారపోసాడు నాన్న. ఇంత ఎత్తుకెదిగిన నేను వాళ్లకింత నీడ నివ్వలేకపోయాను. ఏమి చేసినా వాళ్ల ఇద్దరి రుణం తీర్చుకోలేను. అలాంటిది వాళ్లిదరినీ అనాథల్లా... అన్నాను గద్గదమైన గొంతుతో.

పశ్చాతాపానికి మించిన ప్రాయశ్చితం లేదు! అక్కడున్న వాళ్ళందరూ అనాథలు కాదు! చాలా వరకూ పిల్లలున్న వాళ్ళే. ఒకల్లిద్దరు మాత్రం పిల్లలు లేనివాళ్ళు యాక్సిడెంట్లో పోయినవాల్లు వాళ్ళకీ వీళ్ళకీ తేడా ఉండాలి కదరా అన్నాడు. నాకూ కన్నీళ్లుఆగలేదు.

ఒక్కమాట చెప్పనా, సంపాదన అంటే డబ్బు కాదురా, ఆప్యాయత అనుబంధం. డబ్బు సంపాయించటం ఎవరి వళ్ళ నన్నా అవుతుంది. బిచ్చగాడి నుండి కోటీశ్వరుడి వరకూ నిత్యం అదే రంధిలో పడి కొట్టుకుపోతుంటారు. మనకోసం మరో మనిషి అన్న కాన్సెప్ట్ గొప్పదిరా! అవసరాలు తీర్చేది డబ్బే అనుకుంటారు కాని మనుషులే అనేది తెలుసుకోరు. అనాథ శరణాలయాలు పిల్లలకీ, ముసలివాల్లకీ ఉంటాయి కానీ నడివయసు వారికి ఉండవు ఎందుకంటే సంపాదించే వాళ్ళకే జీవించే హక్కుందనా? మిగిలిన వాళ్ళు మనుషులు కారా? పిలల్లు రేపటి కాబోయే పౌరులు, వాళ్ళకి బాల్యంలోనే చెడు బీజం పడితే సమాజ పురోగతి ఎలా? అలాగే పెద్దవాళ్ళు అనుభవంతో తలపండినవాళ్ళు వాళ్ళ అనుభవాన్ని ఉపయోగించుకోకుండా వట్టిపోయిన వాల్లకింద జమకడితే ఇంకా మనకి నిష్కృతి ఏది? నా అనే స్వార్థం ఉన్నంత వరకూ ప్రగతి ఉండదు. స్వార్థాన్ని ఎప్పుడు వీడతాడో అప్పుడు మనసు స్వచ్ఛతని సంతరించుకుంటుంది. కల్మషం లేని మనసుకి కష్టాలు.. బాధలు ఎందుకు ఉంటాయి? కనీసం నీ చుట్టూ ఉన్న వాళ్ళకోసం నువ్వు బ్రతకడం మొదలుపెడితే.. అదే అందర్నీ నీకు చుట్టాలని చేస్తుంది... నిధానంగా ప్రపంచం ఏకత్వాన్ని సంతరించు కుంటుంది. అప్పుడు ప్రతివాడు మానవ సంబంధాల కోటీశ్వరుడే! చూడు వాళ్ళు ఎంత నిండుగా నన్ను దీవించారో. దాని ముందు ఏదైనా బలాదూరే అనిపించదూ! ఎంత డబ్బుంటే మాత్రం అంత గొప్ప అనుభూతి సొంతమవుతుంది? నా దృష్టిలో రక్త సంబంధం కన్నా, మనిషి సంబం ధం గొప్పది. రేపు పోయాక. అడవిలో నేల రాలిన పిచ్చి మొక్కలా కాకుండా అర్థవంతమైన ఔషధ మొక్కలా కాని, పూజలో ఉపయోగించే పూమొక్కలా కాని అస్తిత్వాన్నందితే అంతకన్నా మనిషి జీవితానికి ఇంకేం కావాలి?

మరో సంవత్సరం అయ్యేసరికి మా ఆఫీసులో చాలా మంది వారివారి పరిధులలో సమాజానికి తమ చేయూత నివ్వడం మొదలు పెట్టారు. రాజశేఖరం ఒక దీపం అది సమాజం కోసం వెలుగునిస్తుంది. తనలాంటి దీపాలని వెలిగిస్తుంది. వాళ్ళకి తరతమ బేధాలుండవు. అందరూ నా వాళ్ళ అనుకునే స్వార్థం వాళ్ళది.... జీతే రహెూ రాజశేఖర్!

■

